# AKSHARA TODAY

అక్షర టుడే

TOWARDS... TRUTH, TRUST, TREND

WWW.AKSHARATODAY.IN

## జస్టిస్ యశ్వంత్ వర్మ రాజీనామా



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ రాజీనామా చేశారు. తన రాజీనామాను రాష్ట్రపతికి శుక్రవారం సమర్పించారు. గతంలో ఆయన నివాసంలో భారీగా నగదు పట్టుబడిన విషయం తెలిసిందే. ఈ ఆరోపణల నేపథ్యంలో ఢిల్లీ నుంచి అలహాబాద్‌కు బదిలీ అయ్యారు. ప్రస్తుతం ఆయనపై అంతర్గత విచారణ కొనసాగుతోంది. కాగా.. ఈ వివాదం పార్లమెంటరీ తొలగింపు ప్రక్రియ వరకు వెళ్లే ఛాన్స్ ఉంది. ఆయనను పదవి నుంచి తొలగించాలని కోరుతూ 140 మందికి పైగా లోక్‌సభ సభ్యులు ప్రవేశపెట్టిన తీర్మానానికి మద్దతు పలకడంతో, ఆయనపై అభిశంసన ప్రక్రియ వేగవంతమవడంతో రాజీనామాను రాష్ట్రపతికి పంపారు.

## కొత్త డీజీపీగా సీవీ ఆనంద్?



**అక్షరటుడే, హైదరాబాద్:** తెలంగాణ కొత్త డీజీపీగా సీవీ ఆనంద్‌ను ప్రభుత్వం నియమించనున్నట్లు తెలిసింది. ఈనెల 14న అధికారికంగా ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉన్నట్లు సమాచారం. ప్రస్తుతం డీజీపీగా శివధర్‌రెడ్డి కొనసాగుతున్నారు. ఆయన ఈనెల 31న రిటైర్ కానున్నారు. దీంతో కొత్త డీజీపీ నియామకంపై ప్రభుత్వం గతంలోనే కసరత్తు ప్రారంభించింది. ఈ మేరకు యూపీఎస్సీకి నలుగురి పేర్ల జాబితా చేరింది. అందులో ముగ్గురి పేర్లను యూపీఎస్సీ తిరిగి రాష్ట్ర ప్రభుత్వానికి పంపింది. సీవీ ఆనంద్, వినాయక్ ప్రభాకర్ ఆప్టే, సౌమ్యా మిశ్రా పేర్లను యూపీఎస్సీ పంపించింది. వీరిలో ఒకరు డీజీపీ కానున్నారు.

**10-4-2026 (Friday)** MAIN EDITION

## రాజ్యసభ సభ్యుడిగా నితీశ్ ప్రమాణం



అక్షరటుడే, నేషనల్ డెస్క్: జేడీయూ అధినేత నితీశ్ కుమార్ రాజ్యసభ సభ్యుడిగా ప్రమాణ స్వీకారం చేశారు. పార్లమెంట్‌లో రాజ్యసభ చైర్మన్ రాధాకృష్ణన్ ఆయనతో ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో బీజేపీ జాతీయ మాజీ అధ్యక్షుడు జేపీ నడ్డా, కేంద్ర మంత్రి నిర్మల, ముఖ్య నేతలు పాల్గొన్నారు.

## ఇరాన్ యుద్ధంలో షాహిద్ డ్రోన్లను కూల్చాం



అక్షరటుడే, నేషనల్‌డెస్క్: అమెరికా స్థావరాలే లక్ష్యంగా గల్ఫ్ దేశాల్లో ఇరాన్ చేసిన ప్రతీకార దాడులను తమ దళాలు సమర్థంగా తిప్పికొట్టాయని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ తెలిపారు. ఆ దేశాలపై ఇరాన్ ఉపయోగించిన షాహెద్ డ్రోన్లను తమ దళాలు కూల్చాయని పేర్కొన్నారు. అటువంటి డ్రోన్లనే రష్యా తమపై వాడుతోందని చెప్పారు.

## బెంగాల్ బీజేపీ ఎన్నికల మేనిఫెస్టో విడుదల



అక్షరటుడే, నేషనల్ డెస్క్: పశ్చిమ బెంగాల్ ఎన్నికల నేపథ్యంలో బీజేపీ ఎన్నికల మేనిఫెస్టోను విడుదల చేసింది. 'సంకల్ప ప్రత' పేరుతో మేనిఫెస్టోను శుక్రవారం కేంద్ర హోం మంత్రి ఆవిష్కరించారు. మహిళలకు నెలకు రూ. 3వేలు, నిరుద్యోగ యువతకు రూ. 3వేల నిరుద్యోగ భృతి ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఐదేళ్లలో కోటి కొత్త ఉద్యోగాలు కల్పిస్తామన్నారు.

## కాకతీయ వైద్య కళాశాలలో ర్యాగింగ్..

### ఏడుగురు విద్యార్థుల సస్పెన్షన్




**అక్షరటుడే, వరంగల్:** వరంగల్‌లోకి కాకతీయ వైద్య కళాశాలలో ర్యాగింగ్ కలకలం రేపింది. 20 మంది జూనియర్లను సీనియర్లు గోడ కుర్చీ వేయించారు. గత నెలలో జరిగిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కాకతీయ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ థర్డియర్ విద్యార్థులు సెకండియర్ స్టూడెంట్స్‌ను ర్యాగింగ్ చేశారు. ఈ ఘటనపై విచారణ జరిపిన కాలేజీ అధికారులు విద్యార్థులపై చర్యలకు సిఫార్సు చేశారు. దీంతో ఏడుగురు థర్డ్ ఇయర్ విద్యార్థులను ఆరు నెలల పాటు సస్పెండ్ చేస్తూ ప్రిన్సిపల్ సంధ్య ఉత్తర్వులు జారీ చేశారు.

## రౌడీ షీటర్లకు డ్రగ్ టెస్ట్‌లు.. 190 మందికి పాజిటివ్

**అక్షరటుడే, హైదరాబాద్ సిటీ:** నగరంలో గంజాయి, డ్రగ్స్ దందా సాగుతోంది. అలాగే రౌడీ షీట ర్లు సైతం ఇటీవల రెచ్చిపోతున్నారు. ఈ క్రమంలో పోలీసులు కీలక ఆపరేషన్ చేపట్టారు. నగరంలోని రౌడీషీటర్లకు డ్రగ్ పరీక్షలు నిర్వహించారు. హైదరాబాద్‌లో 1300 మంది రౌడీషీటర్లను పోలీ సులు గుర్తించారు. వారిలో 250 మంది కి డ్రగ్స్ పరీక్షలు చేయగా.. 190 మంది డ్రగ్స్ పాజిటివ్ వచ్చింది. వీరు గంజా యికి అలవాటు పడ్డట్లు పోలీసులు గుర్తించారు. అయితే రౌడీ షీటర్లకు గంజాయి ఎక్కడి నుంచి వస్తుందనే కోణంలో విచారణ చేస్తున్నారు.

# కేసీఆర్ వ్యూహం అదేనా!



**మాజీ మంత్రి, కాంగ్రెస్‌లో 4 దశాబ్దాలు సేవలు అందించిన జీవన్‌రెడ్డి త్వరలో బీఆర్ఎస్‌లో చేరనున్నారు. జగిత్యాలకు చెందిన జీవన్‌రెడ్డి పదేళ్ల బీఆర్ఎస్ హయాంలో సైతం కాంగ్రెస్‌ను వీడకుండా.. పార్టీ కోసం పని చేశారు. తాజాగా అలాంటి నేత తమ పార్టీ అధికారంలో ఉన్న సమయంలో గులాబీ కండువా కప్పుకోనున్నారు. అయితే జీవన్‌రెడ్డి అంశంలో బీఆర్ఎస్ స్పెషల్ ఫోకస్ పెట్టింది. దీంతో కాంగ్రెస్‌లోని అసంతృప్తులను తమ వైపు తిప్పుకునేందుకు ఆ పార్టీ ప్లాన్ వేసినట్లు సమాచారం.**

**– అక్షరటుడే, హైదరాబాద్**

- **బీఆర్ఎస్‌లో చేరనున్న మాజీ మంత్రి జీవన్‌రెడ్డి**
- **స్వయంగా ఇంటికి వెళ్లిన కేటీఆర్**
- **లంచ్‌కు ఆహ్వానించిన గులాబీబాస్**
- **కాంగ్రెస్ అసంతృప్తులకు గాలం వేసే యోచన**

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్వయంగా జీవన్‌రెడ్డి ఇంటికి వెళ్లి పార్టీలోకి రావాలని ఆహ్వానించారు. మరోవైపు కేసీఆర్ సైతం ఆయనను లంచ్‌కు పిలిచారు. జీవన్‌రెడ్డి చేరిక విషయంలో బీఆర్ఎస్ వేస్తున్న అడుగులు కీలకంగా మారాయి. ఆయనకు పార్టీలో ప్రాధాన్యం ఇస్తామని ఇప్పటికే హామీ ఇచ్చినట్లు తెలిసింది. అంతేగాకుండా ఆయన చేరిక ద్వారా కాంగ్రెస్‌లో అసంతృప్తులకు సైతం గాలం వేయాలని బీఆర్ఎస్ యోచిస్తున్నట్లు సమాచారం. ఇందులో భాగంగానే.. ఈ విషయంలో కేసీఆర్, కేటీఆర్ స్వయంగా చొరవ చూపుతున్నారని తెలిసింది.

### సీనియర్ల గుర్రు

కాంగ్రెస్‌లో పలువురు సీనియర్ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి పాలనపై గుర్రుగా ఉన్నారు. ముఖ్యంగా ఏళ్లుగా పార్టీ కోసం పని చేస్తున్న వారిని కాదని కొత్తగా వచ్చిన వారికి పదవులు ఇస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ఇటీవల రాజ్యసభ ఎంపీ సీటు విషయంలో కూడా సీనియర్లను కాదని సీఎం తన సన్నిహితుడైన వేం నరేందర్‌రెడ్డికి కేటాయించారు. దీనిపై పలువురు అసంతృప్తితో రగిలిపోతున్నారు. కాంగ్రెస్‌లో అసంతృప్తితో ఉన్న నేతలను తమ పార్టీలోకి ఆహ్వానించాలని బీఆర్ఎస్ ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది. తమ పార్టీలో చేరిత మంచి అవకాశం ఇస్తామని చెప్పడానికే జీవన్ రెడ్డి విషయంలో అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలుస్తోంది.

### గతంలో రేవంత్‌రెడ్డి సైతం..

బీఆర్ఎస్ హయాంలో కేసీఆర్ పక్కన పెట్టిన నేతలను రేవంత్‌రెడ్డి ఏకం చేశారు. వాళ్లతో కలిసి కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తెచ్చారు. తుమ్మల నాగేశ్వరరావు, జూపల్లి కృష్ణారావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి వంటి నేతలను కలుపుకొని వెళ్లి అధికారం దక్కించుకున్నారు. బీఆర్ఎస్ సైతం ఇదే ఫార్ములా అప్లయ్ చేయాలని చూస్తున్నట్లు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఇప్పటికే రేవంత్‌రెడ్డి పాలనపై ప్రజల్లో కొంత అసంతృప్తి ఉంది. దీనికి తోడు ఆ పార్టీలోని సీనియర్లు తమ వైపు వస్తే వచ్చే ఎన్నికల్లో విజయం సాధించవచ్చని బీఆర్ఎస్ యోచిస్తున్నట్లు తెలుస్తోంది.

### జీవన్‌రెడ్డితో లంచ్ మీటింగ్

ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌కు కేసీఆర్ మాజీ మంత్రి జీవన్ రెడ్డితో లంచ్ మీటింగ్‌లో పాల్గొన్నారు. ఈ భేటీలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు వేముల ప్రశాంత్‌రెడ్డి, గంగుల కమలాకర్ సైతం పాల్గొన్నారు. పార్టీలో చేరిక తేదీ, ప్లీనరీతో పాటు జీవన్ రెడ్డికి ఇచ్చే పదవిపై వారు చర్చించినట్లు సమాచారం.

## ఆరోగ్యం లేకపోతే డబ్బున్న వృథానే : మంత్రి రాజనర్సింహ




**అక్షరటుడే, హైదరాబాద్:** ఆరోగ్యంగా ఉండడం ఆప్షన్ కాదు, ఆవశ్యకం అని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. మనం ఎంత ధనవంతులైనా, ఆరోగ్యం లేకపోతే అన్నీ వృథానే అని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ యోగా.. లేదా మరేదైన ఫిజికల్ యాక్టివిటీని తమ దైనందిన జీవితంలో భాగంగా చేసుకుని ఆరోగ్యకరమైన అలవాట్లను పాటించాలని సూచించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక ఆరోగ్య వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించిన యోగా కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి రాజనర్సింహ పాల్గొన్నారు.

## ఆర్టీసీ ఉద్యోగులకు డీఏ పెంపు



**అక్షరటుడే, హైదరాబాద్:** తెలంగాణ ఆర్టీసీ ఉద్యోగులకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. 2.1 శాతం డీఏ పెంచుతున్నట్లు తెలిపింది. ఈ మేరకు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించారు. పెంచిన డీఏను 2026 జనవరి నుంచి అమలు చేస్తామన్నారు. ఆర్టీసీ ఉద్యోగులు తమ సమస్యల పరిష్కరించాలని చాలా రోజులుగా డిమాండ్ చేస్తున్నారు. డీఏ పెంచాలని కోరుతున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వం డీఏ పెంచుతూ నిర్ణయం తీసుకుంది. గతంలో 50.7 శాతం ఉన్న డీఏ తాజా పెంపుతో 52.8 శాతానికి చేరింది. గడిచిన మూడు నెలలకు గాను ఒక్కో నెలలో సప్లిమెంటరీ బిల్స్ ద్వారా చెల్లించను న్నట్లు మంత్రి తెలిపారు. పెరిగిన డీఏతో ఆర్టీసీపై ప్రతి నెల రూ.2.82 కోట్ల అదనపు భారం పడుతుందని మంత్రి పొన్నం తెలిపారు. రాష్ట్రంలో చివరగా జూలై 2025 లో డీఏను 2.1శాతం పెంచారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ పలు రీజియన్ల ఆర్ఎంలతో సమా వేశమయ్యారు. పెండింగ్ పనులు, అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు.

## చీరకట్టు సోయగాలతో కుషిత కల్లపు..!



**సాంప్రదాయ దుస్తులు ధరిస్తూ తమ అందాలతో అభిమానులను ఆకట్టుకుంటున్నారు కొంతమంది హీరోయిన్స్. ముఖ్యంగా రుక్మిణి వసంత్, అనుపమ పరమేశ్వరన్, రెజీనా కాసాండ్రా ఇలా చెప్పకుంటూ పోతే ఎంతోమంది హీరోయిన్లు చీర కట్టులో కనిపించే అభిమానులను మెస్మరైజ్ చేస్తున్నారు. ఇప్పుడు ఆ జాబితాలోకి కుషిత కల్లపు కూడా వచ్చి చేరింది. తాజాగా చీర కట్టులో అందాలను ఆరబోస్తూ ఇన్‌స్టాగ్రామ్ షేర్ చేసిన ఈ ఫొటోలు అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి. ఇకపోతే ఈ ముద్దుగుమ్మను ఇలా చూసేసరికి అభిమానులు కొత్త నేషనల్ క్రష్ అంటూ పిలుస్తున్నారు.**

**- అక్షరటుడే, సినిమాడెస్క్**

## అమెరికాఇరాన్ చర్చల్లో కొత్త ట్విస్ట్..




**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** అమెరికా ఇరాన్ మధ్య జరగాల్సిన శాంతి చర్చల విషయంలో కొత్త ట్విస్ట్ చోటు చేసుకుంది. లెబనాన్‌లో కాల్పుల విరమణ జరిగే వరకు చర్చలకు అవకాశం లేదని టెహ్రాన్ తేల్చి చెప్పింది. పశ్చిమాసియాలో యుద్ధం ముగించేందుకు అమెరికా ఇరాన్ చర్చలకు అంగీకరించిన విషయం తెలిసిందే. ఇప్పటికే రెండు వారాలపాటు కాల్పుల విరమణకు ఇరుపక్షాలు అంగీకరించాయి. శుక్రవారం నుంచి పాక్‌లోని ఇస్లామాబాద్ వేదికగా చర్చలు జరగాల్సి ఉంది. ఉభయ పక్షాలను వేరువేరు చోట్ల కూర్చోబెట్టి చర్చలు జరపడం కోసం పాకిస్థాన్‌లో ఏర్పాట్లు కూడా చేశారు. అయితే చివరి నిమిషంలో ఇరాన్ ట్విస్ట్ ఇచ్చింది. లెబనాన్ అంశంపై తేల్చేంత వరకు తాము చర్చలకు వెళ్లబోమని ప్రకటించింది. లెబనాన్‌పై ఇజ్రాయిల్ దాడులను తక్షణమే ఆపాలని డిమాండ్ చేస్తూ అమెరికాతో కాల్పుల విరమణ చర్చల నుంచి వైదొలగుతామని ఇరాన్ హెచ్చరించింది. ఈ విషయాన్ని ఆ దేశ ప్రభుత్వ మీడియా ఫార్స్ న్యూస్ ధ్రువీకరించింది.

## బీహార్ నూతన సీఎంగా సమ్రాట్ చౌదరి?



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** బీహార్ నూతన ముఖ్యమంత్రిగా ప్రస్తుత ఉప ముఖ్యమంత్రి, బీజేపీ నేత సమ్రాట్ చౌదరి ఎన్నిక కానున్నారు. ఈ మేరకు అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. కాగా.. బీజేపీ నేత ముఖ్యమంత్రి అవుతుండడం బీహార్ రాజకీయ చరిత్రలో ఇదే తొలిసారి. ముఖ్యమంత్రిగా సుదీర్ఘ కాలం పనిచేసిన జేడీయూ అధినేత నితీశ్ కుమార్ ఇటీవల రాజ్యసభకు ఎన్నికయ్యారు. ఆయన శుక్రవారం రాజ్యసభ సభ్యుడిగా ప్రమాణ స్వీకారం చేయబోతున్నారు. ఏప్రిల్ 14న బీహార్ సీఎం పదవికి నితీశ్ కుమార్ రాజీనామా చేయనున్నారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి ఎన్నిక అనివార్యమైంది. అయితే ఈసారి బీజేపీకి ముఖ్యమంత్రి అవకాశం ఇవ్వనున్నారు. ఈ నేపథ్యంలో ప్రస్తుత ఉప ముఖ్యమంత్రి, బీజేపీ నేత సమ్రాట్ చౌదరికే ముఖ్యమంత్రి అయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని తెలుస్తోంది.

## ఫేస్‌బుక్‌లో పరిచయమై సహజీవనం.. రూ.కోటితో పరారీ



**అక్షరటుడే, హైదరాబాద్:** సోషల్ మీడియాలో గుర్తు తెలియని వ్యక్తులతో చాటింగ్‌లు, పరిచయాలు మంచివి కావని పోలీసులు చెబుతున్నా.. కొందరు పట్టించుకోవడం లేదు. తాజాగా ఓ మహిళ ఫేస్‌బుక్‌లో పరిచయమైన వ్యక్తితో సహజీవనం చేసింది. అంతేగాకుండా అతడికి రూ. కోటి ఇచ్చింది. అతడు పరారవడంతో పోలీసులను ఆశ్రయించింది. జూబ్లీహిల్స్‌కు చెందిన మహిళకు గతంలోనే పెళ్లి అయింది. అయితే ఆమెకు ఫేస్‌బుక్‌లో సూరజ్ శర్మ అనే వ్యక్తితో పరిచయమైంది. అదికాస్త సహజీవనానికి దారి తీసింది. ప్రేమిస్తున్నానంటూ ఆమెను మభ్యపెట్టిన సూరజ్ శర్మ మూడేళ్లుగా సహజీవనం చేస్తున్నాడు. తాను సంపన్నుడైన వ్యాపారిగా పరిచయం చేసుకున్నాడు. దీంతో నిజమేనని నమ్మిన సదరు మహిళ అతడితో సహజీవనం చేసింది. ఆ తర్వాత.. వ్యాపారంలో అత్యవసరంగా డబ్బు అవసరం పడిందని అతడు ఆమెను నమ్మించాడు. దీంతో రూ.కోటి ఇచ్చింది. ఆ డబ్బులు తీసుకొని సూరజ్ శర్మ పరారయ్యాడు.